# కాంగ్రెస్‌కు ఓటేస్తే చీకట్లు

- మాయమాటలు నమ్మితే మోసపోతాం
- కనిపిస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలి
- అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్
- రాయికోడ్ మండలంలో ప్రచారం



రాయికోడ్ : సీరూర్‌లో హోటల్‌లో చాయి చేస్తున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

రాయికోడ్, నవంబర్ 21 : కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలు తప్పవని, తిరిగి అంధకారంలోకి వెళ్తామని ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. రాయికోడ్ మండలంలోని దౌల్తాబాద్, సీరూర్, మదాపూర్, మహిబాత్‌పూర్, జంబ్గి(సీ) నల్లంపల్లి, పాంపాడు, శాపూర్, శంశోద్దిన్‌పూర్, ఉల్గెరా గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఇంటింటి ప్రచారం నిర్వహించి, కారు గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తొమ్మిదిన్నరేండ్లలో సీఎం కేసీఆర్ తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో రాష్ట్రాన్ని ముందుంచారని గుర్తుచేశారు. అందోల్‌లో మూడుసార్లు తిరస్కరించిన నాయకుడు అందోల్‌లో అభివృద్ధి చేస్తానని చెప్పితే నమ్మడానికి ఇక్కడ ప్రజలు అమాయకులు కాదన్నారు. ప్రతిపక్ష నాయకులు చెప్పే మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. అర్హులందరికీ గృహలక్ష్మి ఇండ్లు, ఆసరా పింఛన్లు, రేషన్ కార్డులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి,సంక్షేమాన్ని చూసి ఆశీర్వచించాలని కోరారు. కాంగ్రెస్ హయాంలో తెలంగాణ కరువుతో అల్లాడిందని, ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే కరువుకు స్వాగతం చెప్పినట్లే అవుతుందని పేర్కొన్నారు. డ్రైవర్‌లేని బస్సులాంటి కాంగ్రెస్ చేతిలో తెలంగాణను పెడితే దోచుకుతింటారని, అభివృద్ధి చేయరని ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆదరించాలని ఆయన కోరారు.

ప్రచారంలో జడ్పీ మాజీ చైర్మన్ బాలయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి, సాయికుమార్, సతీష్‌కుమార్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్ధన్నపాటిల్, సర్పంచ్‌ల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్‌పాటిల్, ఆత్మ కమిటీ చైర్మన్ విఠల్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, కార్యదర్శి బస్వరాజుపాటిల్, శంకర్, వైస్ చైర్మన్ తుకారం కురుమ, మైనార్టీ నాయకులు మహ్మద్ సుల్తాన్, నజీంపాటిల్, ఎంపీటీసీలు శివకుమార్‌పాటిల్, నిరంజన్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రశంత్‌పాటిల్ ఉన్నారు.


సీరూర్‌లో బీఆర్ఎస్‌లో చేరుతున్న సింగితం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు


రాయికోడ్ : జంబ్గి(కె) గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్


రాయికోడ్ : శాపూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలతో ప్రచారం నిర్వహిస్తున్న చంటి క్రాంతికిరణ్

## పారదర్శకంగా ఎన్నికలు జరగాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి శరత్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 21: శాసనసభ ఎన్నికలు పారదర్శంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సూచించారు. ఎన్నికల నేపథ్యంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో మంగళవారం సాయంత్రం సమీక్షించారు. ఈ సందర్భంగా సీఈవో వికాస్ రాజ్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణతో ముడిపడిన వివిధ అంశాలకు సంబంధించిన నివేదికలను అందించడంలో జాప్యం చేయకుండా సకాలంలో పంపించాలన్నారు. 80 ఏండ్లు పైబడిన వృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులకు వారి ఇండ్ల నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్‌తో మాట్లాడి తెలుసుకున్నారు. ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు రిటర్నింగ్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లు, పోలింగ్, కౌంటింగ్ కోసం చేపట్టిన చర్యలపై ఆరా తీశారు. నూతన ఓటర్లకు పోస్టల్ శాఖ ద్వారా ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని, వాటి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ప్రతి ఓటరుకూ ఓటరు సమాచార స్లిప్పులు పంపిణీ చేయాలని, ప్రతిరోజూ ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీపై నివేదిక ఇవ్వాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ర్యాండమైజేషన్ పూర్తి చేసి, ఈవీఎం కండిషన్ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. పోలింగ్ సిబ్బంది, ర్యాండమైజేషన్, శిక్షణపై ఆరా తీశారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాధులను తక్షణమే స్పందిస్తూ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించాలని ఆదేశించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో జెండా ఊపీ ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

# 30న ఓటేయాలి

- ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి
- ఎలాంటి ప్రలోభాలకు లోనుకావద్దు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్
- సంగారెడ్డి పట్టణంలో అవగాహన ర్యాలీ

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 21 : ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ పిలుపునిచ్చారు. ఓటు వజ్రాయుధం లాంటిదని, నైతికంగా ఓటు వేయాలని సూచించారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఉద్యోగులు, అధికారులు, కళాకారులు, వివిధ వర్గాల ప్రజలు, యువత, విద్యార్థులు యువజన సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ట్రాన్స్‌జెండర్లు, భద్రతా దళాలు, మహిళలతో మంగళవారం కలెక్టరేట్ నుంచి అంబేద్కర్ మైదానం వరకు పెద్ద ఎత్తున అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుంచి ఐబీ, కొత్త బస్టాండుల మీదుగా అంబైద్కర్ మైదానం వరకు కొనసాగింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమన్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉంటుందని, జిల్లాలో 18 ఏండ్లు నిండినవారిని ఓటరుగా నమోదు చేశామన్నారు. ప్రజా స్వామ్యాన్ని బలోపేతం చేసే అవకాశం ఓటుకు మాత్రమే ఉన్నదన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా, స్వేచ్ఛగా, నైతికంగా ఓటు చేయాలని సూచించారు. ఈ నెల 30న పోలింగ్ రోజు ప్రతి ఒక్కరూ ఓటు వేసి తమకు నచ్చిన నాయకుడ్ని ఎన్నుకోవాలన్నారు.


ర్యాలీలో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్, ఎస్పీ రూపేశ్, అధికారులు

### బుల్లెట్ కన్నా బ్యాలెట్ ఎంతో గొప్పది

ఎస్పీ రూపేశ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని, బుల్లెట్ కన్నా బ్యాలెట్ ఎంతో గొప్పదని, ప్రజాస్వామ్యంలో ఎన్నికలు గొప్ప ఘట్టమని అభివర్ణించారు. విద్యార్థులు, యువత తాము ఓటు వేయడంతో పాటు ఇంట్లో అందరూ ఓటు వేసేలా చైతన్యం చేయాలన్నారు. మన అభివృద్ధికి రాజ్యాంగం ఇచ్చిన ఆయుధం ఓటు అని తెలిపారు. దేశ, రాష్ట్ర, జిల్లా అభివృద్ధి కోసం మంచి నాయకుడ్ని ఎన్నుకోవడంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అదనపు ఎస్పీ అశోక్, డీఆర్వో నగేశ్, జిల్లా అధికారులు, ఉద్యోగులు, అధికారులు, కళాకారులు, విద్యార్థులు యువజన సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు.

## స్వేచ్ఛగా ఓటేయాలి

- శాంతియుత ఎన్నికలకు సహకరించాలి
- సంగారెడ్డి ఎస్పీ రూపేశ్
- కేంద్రసాయుధ బలగాల ఫ్లాగ్‌మార్చ్


కేంద్ర బలగాల కవాతు ప్రారంభించిన ఎస్పీ రూపేశ్, కమాండర్లు

సంగారెడ్డి, నవంబర్ 21 : శాసనసభ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా శాంతియుతంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని, ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించాలని ఎస్పీ రూపేశ్ సూచించారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో కేంద్ర సాయుధ బలగాల కవాతు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 30న జరుగనున్న ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. సంఘవిద్రోహ శక్తులు, అల్లరిమూక నుంచి రక్షించడానికి ప్రజల్లో ధైర్యాన్ని నింపి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. కవాతులో అదనపు ఎస్పీ అశోక్, సంగారెడ్డి డీఎస్పీ రమేష్‌కుమార్, ఇన్స్‌పెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, నాగరాజు, మహేశ్‌గౌడ్, సుధీర్‌కుమార్, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కమాండర్ రాహుల్ రామరావ్‌జడే, ఆర్ఐ షేక్‌అహ్మద్, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.


సంగారెడ్డిలో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు